## కొనుగోలు కేంద్రాల తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న డీఎం గోపాల్

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 29 : జిల్లాలోని డీఆర్‌డీఏ, పీఏసీఎస్, డీసీఎంఎస్ ఏజెన్సీల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ గెడం గోపాల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్ మోతీలాల్ ఆదేశాల మేరకు కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. క్వాలిటీ ధాన్యాన్ని సేకరించాలని, నాణ్యతపై రైతులకు అవగాహన కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. రిజిస్టర్లను పరిశీలించారు. జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో వరి ధాన్యం కొనుగోళ్లు దాదాపు 90 శాతం పూర్తయ్యాయని, జైపూర్, భీమారం, కోటపల్లి, చెన్నూర్, వేమనపల్లి మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ఒకటీ.. రెండు రోజుల్లో పూర్తవుతాయన్నారు. జనవరి 10వ తేదీలోగా కొనుగోళ్లు పూర్తి చేసి ట్యాబ్‌లలో ఎంట్రీలు చేయాలని కోరారు. డీఎం వెంట సివిల్ సప్లయ్ కార్యాలయ డీఆర్పీ రామస్వామి ఉన్నారు.

## ప్రజాపాలన కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్


దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బోర్కడే హేమంత్

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ రెండో రోజూ కొనసాగింది. రెబ్బెన మండలం కైర్‌గాం కేంద్రాన్ని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్‌రావు పరిశీలించారు. అర్జీదారులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. దరఖాస్తుల సమర్పణలో తలెత్తుతున్న ఇబ్బందుల గురించి తెలుసుకున్నారు. జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరూ అర్జీలు పెట్టుకోవాలని సూచించారు. ప్రజా పాలన కార్యక్రమం మొదటి రోజు కొన్ని గ్రామాల్లో ఆలస్యంగా ప్రారంభం కాగా, రెండో రోజు ఉదయం నుంచే అర్జీలు స్వీకరించారు.

## నమ్మి ఓటేస్తే రోడ్డున పడేస్తారా?

- సర్కారే న్యాయం చేయాలి
- ఆటో డ్రైవర్ల డిమాండ్
- దండేపల్లి, తాళ్లపేటలో రాస్తారోకో, ర్యాలీ
- లక్షెట్టిపేటలో బంద్ సక్సెస్



లక్షెట్టిపేట : తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఓనర్లు, డ్రైవర్లు

దండేపల్లి/లక్షెట్టిపేట, డిసెంబర్29 : మహాలక్ష్మి పథకంతో తమ బతుకులు ఆగమవుతున్నాయని, నమ్మి ఓటేస్తే రోడ్డున పడేస్తారా.. అంటూ ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం దండేపల్లి మండల కేంద్రంతో పాటు తాళ్లపేటలో ఆటో యూనియన్ సంఘాల ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. తాళ్లపేట ప్రధాన రహదారి వద్ద రాస్తారోకో చేపట్టారు. ఇప్పటికైనా సర్కారు స్పందించి తమకు న్యాయం చేయాలని, లేదంటే ఆందోళనలు మరింత తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఫైనాన్స్ కిస్తీలు కట్టలేక ఆటోలు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో దండేపల్లి, తాళ్లపేట ఆటో యూనియన్ సంఘాల నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

### లక్షెట్టిపేటలో..

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ లక్షెట్టిపేటలో ఆటో, టాటా మ్యాజిక్ వాహనాల అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ శుక్రవారం సక్సెస్ అయ్యింది. స్థానిక కరీంనగర్ చౌరస్తా నుంచి అంబేద్కర్ విగ్రహం మీదుగా ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీ తీశారు. అంబేద్కర్ విగ్రహానికి, తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. యూనియన్ అధ్యక్షులు పేరగాని శంకర్, చిన్నయ్య, మల్లేశ్, ఖలీం, సభ్యులు శ్రీనివాస్, తిరుపతి, మోహీన్, అలీం, సజ్జు, తిరుపతి, హైమద్, కిషన్, బాబా, డ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.



తాళ్లపేటలో రాస్తారోకో చేస్తున్న ఆటో డ్రైవర్లు

# అభయ హస్తం.. అయోమయం

## లోపభూయిష్టంగా ఐదు గ్యారెంటీల దరఖాస్తు ఫారం

- అనేక సందేహాలు.. అనుమానాలు
- కొన్ని ప్రశ్నలకు అధికారుల దగ్గర సైతం సమాధానం కరువు
- ఇబ్బందుల్లో దరఖాస్తుదారులు
- సర్కారు స్పందించాలని వేడుకోలు

*అభయహస్తం ఐదు గ్యారెంటీల దరఖాస్తు ఫారం ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నది. పూర్తి లోపభూయిష్టంగా ఉండగా, దరఖాస్తు దారులను తికమకపెడుతున్నది. అప్లికేషన్ నింపేటప్పుడు అనేక అనుమానాలు తలెత్తుతుండగా, ఆయాచోట్ల ఉన్న అధికారులకు సైతం స్పష్టత లేకపోవడం అయోమయానికి గురిచేస్తున్నది. ఇక చేసేదేమీ లేక కొందరు నిరాశతో వెనుతిరుగుతుండగా, మరికొందరు తమకు తోచినంత వరకు ఫారం నింపి ఇచ్చేసి రావడం కనిపిస్తున్నది. ఇకనైనా ప్రభుత్వ పెద్దలు స్పందించి ప్రతి సందేహంపై పూర్తి క్లారిటీ ఇవ్వాలని ప్రజానీకం కోరుతున్నది.*




మంచిర్యాల, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అభయహస్తం ఐదు గ్యారెంటీలకు ఒకే దరఖాస్తు నింపమనడమో.. లేక టెక్నికల్ సమస్యలపై అధ్యయనం చేసి విధివిధానాలను సిద్ధం చేయకపోవడమో తెలియదు కానీ.. పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకానికి సంబంధించి అన్నింటికీ ఒకే అర్జీ పత్రం తీసుకురాగా, అనేక సందేహాలు వస్తున్నాయి. ఆయా అంశాల్లో స్పష్టత లేకపోవడంతో.. అక్కడున్న అధికారులను అడిగితే.. మీరైతే ఫారం నింపి ఇవ్వండి.. తర్వాత చూద్దాం అనే సమాధానం చెబుతున్నారు. మరో రెండు, మూడు నెలల్లో ట్రాన్స్‌ఫర్ అవుతాం.. ఈ అప్లికేషన్లను అడిగేవారెవరూ.. చూసేవారెవరూ అంటూ అధికారులే నిట్టూరుస్తుండడం గమనార్హం. ఈ విషయం బయటికి చెబితే ఇచ్చే పథకం ఎక్కడ ఆపుతారోనని జనం భయపడిపోతున్నారు. అనేక మంది చేసేదేమీలేక తమకు తోచినంత వరకు ఫారం నింపి ఇచ్చి పోతున్నారు.

### జనాల మది తొలుస్తున్న ప్రశ్నలు..

**మహాలక్ష్మి పథకం :** 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.2500 ఇస్తామనేది ఈ పథక ముఖ్య ఉద్దేశం. కానీ.. రేషన్‌కార్డు తప్పనిసరి చేయడంతో చాలా మంది కంగారు పడుతున్నారు. తెలంగాణలో ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చిన్నవయసులోనే ఆడపిల్లలకు పెండ్లిళ్లు చేస్తారు. పెండ్లి పోయిన ఆడపిల్లలు ఆధార్‌కార్డులో భర్త ఇంటి పేరు.. అడ్రస్‌లు మార్చుకున్నారు. ఇప్పుడు రేషన్ కార్డు ఉంటేనే ఇస్తామనడంతో తల్లి ఊరిలో దరఖాస్తు చేసేందుకు ఆధార్‌కార్డులో వివరాలు మార్చుకోవాలా.. లేదా.. అనే విషయంపై స్పష్టత లేదు. దీంతో కొందరు ఆధార్‌లో వివరాలు మార్చుకునేందుకు ఆధార్ అప్‌డేషన్ సెంటర్ల దగ్గర క్యూ కడుతున్నారు.


మంచిర్యాల టౌన్ : దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు

**రూ.500కే గ్యాస్ సిలిండర్ :** ఈ పథకం అమలు తీరుపైనా అనేక సమస్యలు ఉన్నాయి. చాలా మంది ఉద్యోగం రీత్యా వేరే ప్రాంతాల్లో ఉంటున్నారు. రేషన్‌కార్డు మాత్రం సొంత ఊరిలో ఉంది. గ్యాస్ కనెక్షన్ మరో ఊరిలో ఉంది. సంవత్సరానికి ఎన్ని సిలిండర్లు వాడుతారనే కాలమ్ ఇచ్చారు. అందులో వివరాలు నమోదు చేస్తే ఏమైనా కటాఫ్ పెడతారా అన్న సందేహం వస్తున్నది.

**రైతు భరోసా పథకం :** ఈ పథకం అప్లికేషన్ కూడా తలనొప్పులు తెచ్చిపెడుతున్నది. ఇంటి యజమాని(భర్త) పేరుతో దరఖాస్తు చేస్తే, ఇంట్లో మిగిలిన వారి (భార్య, పిల్లలు) పేరు మీద ఉన్న భూమి సర్వే నంబర్లు ఎలా ఇవ్వాలి. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉంటున్న వ్యక్తికి ఆధార్‌కార్డు, రేషన్ కార్డు ఇక్కడే ఉన్నాయి. కానీ వ్యవసాయ భూమి మాత్రం సిరిసిల్ల జిల్లాలో ఉంది. ఇప్పుడు జగిత్యాల జిల్లాలో ఉన్న భూమి సర్వే నంబర్లు వేస్తే.. మంచిర్యాల అధికారులకు అది ఎలా తెలుస్తది. కౌలు తీసుకున్న రైతులు కూడా దరఖాస్తు చేస్తారు సరే.. కానీ రైతు నుంచి కౌలు అగ్రిమెంట్ లేకపోతే దరఖాస్తులో చెప్పాలా.. వద్దా.. ఒక ఐదెకరాలు ఉన్న రైతు మరో ఐదెకరాలు వేరే వారి దగ్గర తీసుకొని సాగు చేస్తున్నాడు. అప్పుడు రెండూ కలిపితే 10 ఎకరాలు అవుతాయి. ఆ వివరాలు చెప్తే 10 ఎకరాలు ఉన్నాయని మొత్తానికే ఇయ్యకుంటే ఎట్లా... సాగు చేస్తున్న భూమి వివరాలు.. సర్వే నంబర్, విస్తీర్ణంతో పాటు చెప్పమని దరఖాస్తులో అడిగారు. కానీ చిన్న డ్యాష్ ఇచ్చి వదిలేశారు. అందులో రాయడానికే సరిపోవడం లేదని కొందరు చెబుతున్నారు. వీటన్నింటికీ సమాధానాలు కావాలని రైతులు అడుగుతున్నారు.

**ఇందిరమ్మ ఇండ్లు :** ఇల్లులేని వారికి ఆర్థిక సాయం అనే కాలమ్ పెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు రెండు, మూడు ఫ్యామిలీలు కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నాయి. తల్లీతండ్రి, వారి కొడుకులు అంతా కలిసే ఉంటున్నారు. వీరందరి అడ్రస్ ఒకటే.. ఇందులో మిగిలిన వారికి సొంత ఇళ్లు కావాలంటే దరఖాస్తు చేశాక... ఆధార్ కార్డు, రేషన్ కార్డు అడ్రస్ చూసి తిరస్కరిస్తారా.. లేక కొత్త ఇండ్లు కట్టుకోడానికి డబ్బులు ఇస్తారా... ఇంటి స్థలం లేకపోతే డబుల్ బెడ్ రూమ్ కట్టిస్తారా, అసలే ఇవ్వరా.. అట్లాంటప్పుడు నిజమైన పేదలకు ఈ పథకం ఎలా న్యాయం చేస్తది. ఇక తెలంగాణ ఉద్యమం చేసి జైళ్లకు పోయినోళ్లు మాత్రమే ఉద్యమకారులా.. మిగిలిన వారు కాదా.. ఎఫ్ఐఆర్ అయినోళ్లకే ఇండ్లు ఇచ్చినప్పుడు శాంతియుతంగా ఉద్యమం చేసినోళ్లకు అన్యాయం చేసినట్లు కాదా.. అన్న ప్రశ్న తలెత్తుతుంది..?

**గృహజ్యోతి పథకం :** 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇచ్చే పథకం ఇది. కానీ దీనికి అప్లయ్ చేయడంలోనూ అనేక సందేహాలు ఉన్నాయి. సొంత ఊరిలో కాకుండా సిటీలో, టౌన్లలో పనులు చేసుకొని బతికేటోళ్లు చాలా వరకు అద్దె ఇండ్లలో ఉంటున్నారు. అలాంటి వారికి అద్దె ఇంటి కరెంట్ బిల్లుకు ఉచిత విద్యుత్‌ను వర్తింప చేస్తారా.. లేదా.. ఆధార్ కార్డు అడ్రస్‌లో ఉన్న ఇంటికే ఉచిత కరెంట్ ఇస్తారా.. ఇక సొంత ఊరిలో కాకుండా టౌన్‌లలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్న వారికి ఉంటున్న దగ్గర ఉచిత కరెంట్ ఇస్తారా.. ఇవ్వరా... అసలు ఇలా రెండు మీటర్లు ఉన్న వారు ఈ పథకానికి దరఖాస్తు చేయాలా.. వద్దా..

### రేషన్ కార్డు లేకుంటే..

ఇక అన్నింటికంటే ముఖ్యమైన సమస్య రేషన్ కార్డు లేనోళ్లు. వీళ్లు ఏం చేయాలో తెలియని పరిస్థితి ఉంది. దరఖాస్తు ఫారంలో చివరకు జత చేయాల్సిన ప్రతుల కాలమ్‌లో.. ఆధార్‌కార్డు జిరాక్స్, తెల్ల రేషన్ కార్డు జిరాక్స్ అని చూపిస్తుంది. అంటే రేషన్ కార్డు లేనోళ్లు దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు అన్నట్లే కదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో అధికారులు సైతం స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. దీంతో ప్రజా పాలన కౌంటర్లకు వెళ్లిన చాలా మంది దరఖాస్తు చేయకుండానే వెనుతిరుగుతున్నారు. రేషన్ కార్డుల విషయంలో ఊరికో ముచ్చట, అధికారికో మాట చెబుతుండడంతో హైరానా పడిపోతున్నారు. కొత్త రేషన్ కార్డులు లేక పాత రేషన్ కార్డుల్లో ఉన్న ప్రకారం ఆధార్ కార్డుల్లో పేర్లు, వివరాలు మార్చుకునేందుకు ఆధార్ సెంటర్లకు పోటెత్తుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వ పెద్దలు స్పందించి దరఖాస్తు విషయంలో వచ్చే ప్రతి సందేహానికి క్లారిటీ ఇవ్వాలని కోరుతున్నారు.

## వైభవంగా మార్కండేయస్వామి ఆలయ వార్షికోత్సవం

దండేపల్లి, డిసెంబర్ 29 : దండేపల్లి మండల కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గణపతి, నవగ్రహ పూజలు, స్వామి వారికి అభిషేకం, మహా హోమం, ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం మార్కండేయ స్వామిని దర్శించుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు గోదాసు బాపు, గౌరవ అధ్యక్షుడు గడ్డం సుధాకర్, నాయకులు వోడ్నాల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు వడ్డెపల్లి దేవయ్య, వోడ్నాల శంకర్ ఉన్నారు.


మంచిర్యాల నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు


హాజరైన బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు

# అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- ప్రజా సమస్యలపై పోరాటం చేద్దాం
- పదవులు అనుభవించి పార్టీ మారే వారికి గుణపాఠం తప్పదు
- స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి
- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు
- నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో సమావేశం

మంచిర్యాల టౌన్, డిసెంబర్ 29 : భవిష్యత్ అంతా మనదేనని, కార్యకర్తలెవ్వరూ అధైర్య పడవద్దని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శుక్రవారం మంచిర్యాలలోని ఎస్‌వీఎస్ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన బీఆర్‌ఎస్ మంచిర్యాల నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గులాబీ సైనికులకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. ప్రజలు ఇప్పటికీ కేసీఆర్ పాలనే కోరుకుంటున్నారన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులైనా ఇంకా గందరగోళ పరిస్థితులే కనిపిస్తున్నాయని, ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చింది లేదని, ఈ విషయాలన్నీ ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని సూచించారు. కేసీఆర్ పాలనలో ఇక్కడి ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, ఇప్పుడు కూల్చివేతలు, బెదిరింపులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పారు. పదవులను అనుభవించి స్వార్థం కోసం పార్టీ మారుతున్న వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పదేళ్లలో అనేక అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని కొనియాడారు. నిత్యం ప్రజలతో మమేకమై ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఓటమితో కుంగిపోవద్దని, అండగా ఉంటామని, పార్టీకోసం పనిచేసేవారందరినీ కడుపులో పెట్టుకొని చూసుకుంటామని భరోసానిచ్చారు. పాత మంచిర్యాల నుంచి రసూల్‌పల్లి వరకు రోడ్డు విస్తరణ, విద్యుదీకరణ, మంచిర్యాల పట్టణంలో నాలుగు జంక్షన్ల అభివృద్ధి బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలోనివేనని, మున్సిపాలిటీలకు రూ. కోటి, పల్లెలకు రూ. 10 లక్షల చొప్పున మంజూరై ఉన్నాయని, వాటి పనులు పూర్తయ్యేసరికి దాదాపు ఏడాది పడుతుందన్నారు. ఈ లోగా స్థానిక సంస్థల ఎన్నికలు, పార్లమెంటు ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలు వస్తాయని అన్నారు. ఈ లోగా పార్టీ శ్రేణులంతా సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అంతకుముందు నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మెతక వైఖరిని మార్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. యువనాయకులు విజిత్‌రావు మంచిర్యాలలోనే ఉండి కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని కోరారు. ఈ సమావేశంలో మంచిర్యాల, నస్పూర్, లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్లు పెంట రాజయ్య, ప్రభాకర్, కాంతయ్య, డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు విజిత్‌రావు, గాదెసత్యం, అక్కూరి సుబ్బయ్య, శ్రీనివాస్, గరిగంటి సరోజ, వెంకటేశ్వర్‌రావు, చిన్నయ్య, సత్తయ్య, బేర సత్యనారాయణ, గోగుల రవీందర్‌రెడ్డి, టీబీజీకేఎస్ నాయకులు పెట్టెం లక్ష్మణ్, పానుగంటి సత్తయ్య, జక్కుల రాజేశం పాల్గొన్నారు.


ఆరోగ్య కేంద్రంలోని మందులను పరిశీలిస్తున్న బృందం సభ్యులు


## హాజీపూర్ పీహెచ్‌సీ తనిఖీ

హాజీపూర్, డిసెంబర్ 29 : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నాణ్యతా ప్రమాణాల పరీక్షా బృందం శుక్రవారం తనిఖీ చేసింది. కోల్‌కతాకు చెందిన డాక్టర్ సుప్రియా చౌదరి, చెన్నైకి చెందిన డాక్టర్ సరస్వతి బృందం ఓపీలో రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రయోగశాల, పరిపాలనా అంశాల గురించి వైద్యురాలు లహరిని అడిగారు. మందులను పరిశీలించారు. ల్యాబ్, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ సేవల గురించి ఆరా తీశారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బారాయుడు, ప్రోగ్రాం అధికారులు డా. అనిత, డా. విజయపూర్ణిమ, డా. ఫయాజ్‌ఖాన్, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జేఎన్-1పై అప్రమత్తంగా ఉండాలి

## కొవిడ్ లక్షణాలుంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలి

- డీఎంహెచ్‌వో డా.సుబ్బారాయుడు
- కొవిడ్‌పై మీడియాతో సమావేశం
- వైద్యాధికారులతో కలిసి వాల్ పోస్టర్ల విడుదల


వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో, వైద్యాధికారులు

మంచిర్యాల ఏసీసీ, డిసెంబర్ 29 : జేఎన్–1 కరోనా వైరస్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డా. జీ. సుబ్బారాయుడు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 21 నుంచి కరోనా ర్యాపిడ్ పరీక్షలు ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకు 1022 పరీక్షలు చేశామని, బుధవారం ఒక పాజిటివ్ కేసు నమోదైందని చెప్పారు. జేఎన్–1 కొవిడ్‌పై మాధ్యమాల్లో జరిగే ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. లక్షణాలున్న వారు పీహెచ్‌సీలకు వెళ్లి ర్యాపిడ్ పరీక్షలు చేసుకోవాలని, ఒకవేళ పాజిటివ్ వస్తే మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలోని ఆర్‌టీపీసీఆర్ ల్యాబ్‌లో టెస్టు చేయించుకోవాలని సూచించారు. అందులోనూ పాజిటివ్ వస్తే హైదరాబాద్‌లోని జీనోమ్ ల్యాబ్‌కు శాంపిల్ పంపించి నిర్ధారించడం జరుగుతుందన్నారు. తుమ్ములు రావడం, జలుబు, జ్వరం, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కళ్లు ఎర్రబడటం, ఒళ్లునొప్పులువంటివి ఉంటే జేఎన్–1 వైరస్ లక్షణాలన్నారు. ప్రజలు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, సామాజిక దూరం పాటించాలని, ఎప్పటికప్పుడు శానిటేషన్ చేసుకోవాలని సూచించారు. అనంతరం కరోనా జాగ్రత్తలపై వాల్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ దవాఖాన సూపరిండెంటెండ్ డా.హరీశ్ చంద్రా రెడ్డి, నోడల్ అధికారి డా.ఫయాజ్‌ఖాన్, డెమో బుక్క వెంకటేశ్వర్లు, డీపీఆర్‌వో సంపత్‌కుమార్ పాల్గొన్నారు.


పెద్ద ఎత్తున క్యూలైన్‌లో నిల్చున్న ప్రజలు

## 'ఆధార్' అవస్థలు

**కాంగ్రెస్ ప్రభుత్వం** ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమం ప్రజలకు కొత్త కష్టాలను తెచ్చిపెడుతున్నది. ఆరు గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకునేవారు ఆధార్‌కార్డులో మార్పు చేర్పుల కోసం మీ సేవ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం పక్కనున్న మీ సేవ కార్యాలయానికి గ్రామీణులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మీ సేవ కార్యాలయాలు పది గంటలకు తెరుస్తుండగా.. ప్రజలు ఉదయం ఏడింటి నుంచే క్యూ కడుతున్నారు. చంటి పిల్లల తల్లులు సైతం తరలివచ్చి నానా అవస్థలు పడుతున్నారు. గురువారం ఉదయం 'నమస్తే తెలంగాణ' అక్కడికి వెళ్లి చూడగా పెద్ద క్యూ కనిపించింది. *- బెల్లంపల్లి, డిసెంబర్ 29*


చంటి పిల్లలతో వచ్చిన తల్లులు


నమస్తే తెలంగాణ CLASSIFIED

**CHANGE OF NAME**

★ I, ASHOK KUMAR BHAIYYA (Old Name), R/o. 7-155, RP Road, Mancherial Dt.-504 208. Changed My Name as ASHOK BHAIYAMAHESHWARI (New), S/o. Giridharlal Bhaiyya.
NT-324500

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677